సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 5 । మార్చి । 2023



డబుల్ బెడ్రూంలు ఎక్కడ..?
ప్రభుత్వం గొప్పగా చెప్పకొనే డబుల్ బెడ్రూంలు ఎక్కడున్నాయని ఆర్‌ఎస్‌పీ ప్రశ్నించారు.

వివరాలు 8లో ▸



బ్రహ్మోత్సవాలు ఆరంభం
అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.4 /19.7

వాతావరణం
తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో వెలసిన జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడికి వనపర్తి అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు శనివారం ప్రత్యేకంగా పూజలు చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి పూర్ణకుంభంతో అదనపు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికి పూజలు జరిపించారు. అనంతరం శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు సైతం వేల సంఖ్యలో పాల్గొని శనిదోష నివారణ పూజలు చేశారు.

ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు చర్యలు

నాగర్‌కర్నూల్: ఈవీఎం, వీవీ ప్యాట్ల భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచే గోదాంను కలెక్టర్ పరిశీలించారు. హైదరాబాద్ ఈసీఐఎల్ నుంచి జిల్లాకు కొత్తగా వచ్చిన 1209 వీవీ ప్యాట్లను బార్కోడింగ్ ఆధారంగా స్కానింగ్ నిర్వహించే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. వీవీ ప్యాట్ల స్కానింగ్‌ను ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోదాం పరిసరాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించారు. జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ గోపిడి, ఎన్నికల డీటీ రవికిరణ్, కరుణాకర్ తదితరులున్నారు.

అచ్చంపేటను అభివృద్ధికి కృషి



అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలను ఏర్పాటు చేస్తామన్నారు. తొమ్మిదో వార్డులో రూ.70 లక్షలు, శ్రీనగర్ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. త్వరలోనే అచ్చంపేటకు సీఎం కేసీఆర్ రానున్నారని, అధిక నిధులు మంజూరు చేయించుకోవడానికి ప్రయత్నాలు చేస్తానన్నారు. అనంతరం పలు కుల సంఘాలు, వివిధ సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్లు, నాయకులు కిషోర్, రమేష్, హుస్సేన్, శివశంకర్, గోపాల్‌నాయక్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట

తెలకపల్లి: రాష్ట్రంలో కులవృత్తులు, కుల సంఘాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణ సేవా సమితికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నిధుల నుంచి నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. నాయీబ్రాహ్మణ సేవా సమితి సభ్యులకు రూ.5 లక్షల ప్రొసీడింగ్ లెటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు, ఎంపీపీ మధు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రమేశ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, ఉపసర్పంచ్ కృష్ణయ్య, రైతుబంధు అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పునర్జన్మ..!

విధి వంచితులకు అండగా నిలుస్తున్న సత్యేశ్వర ఆశ్రమం



ఆశ్రమానికి తీసుకువచ్చిన అభాగ్యులతో నిర్వాహకుడు చిత్తనూరి ఈశ్వర్

అసలు వారెవరో వారికే తెలియదు. అనేకానేక కారణాల వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనై.. మతిస్థిమితం కోల్పోయారు. ఏం చేస్తున్నారో తెలియనిస్థితిలో చింపిరి జుట్టు.. చిరిగిన వస్త్రాలతో అర్ధనగ్నంగా వీధుల్లో తిరుగుతుంటారు. చెత్తకుప్పల్లో పడేసిన ఆహార పదార్థాలను తింటూ డ్రెయినేజీ నీళ్లను తాగుతూ.. రాత్రివేళల్లో చలికి వణుకుతూ, దోమల బాధను భరిస్తూ దుర్భరమైన జీవితం గడిపేస్తుంటారు. అర్ధ నగ్నంగా వీధుల్లో సంచరిస్తుంటే అందరూ అసహ్యించుకొనేవారే కానీ అయ్యో అని జాలిపడేవారు లేరు.. ఇలాంటి మానసిక దివ్యాంగులను బాదేపల్లిలోని మహాలక్ష్మీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్యేశ్వర ఆశ్రమం అక్కున చేర్చుకుంది. విధి వంచితులుగా మారిన వారికి అన్నీ తామే అంటూ సపర్యలు చేస్తోంది.

– చెంచటి హరిప్రసాద్, మహబూబ్‌నగర్ డెస్క్

- మానసిక దివ్యాంగుల కోసం బాదేపల్లిలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- అభాగ్యులకు ఉచిత సేవలు అందిస్తున్న వైనం
- 105 మందిని బాగు చేసి సొంతవారికి అప్పగింత.. ప్రస్తుతం 86 మందికి ఆశ్రయం

అనాథ బాలలు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు.. ఇలా అందరికీ శరణాలయాలు ఉన్నాయి. కానీ మతిస్థిమితం కోల్పోయి వీధుల వెంట తిరిగే వారిని ఎవరూ చేరదీయరు. ఇలాంటి దీనస్థితిలో జీవితాన్ని గడిపే వాళ్లను చేరదీసి.. అక్కున చేర్చుకొని వారిని మామూలు మనుషులుగా చేయడానికి ఏ స్వచ్ఛంద సంస్థలు గానీ, ప్రభుత్వపరంగా గానీ సాహసం చేయడం లేదు. కానీ జడ్చర్ల(బాదేపల్లి)లోని సత్యేశ్వర ఆశ్రమం ఇలాంటి అభాగ్యులకు అండగా ఉంటూ పునర్జన్మ ఇస్తోంది. ఎంతో మంది మానసిక దివ్యాంగులను ఆశ్రమంలో చేర్పించుకొని.. వారి బాగోగులు చూసుకుంటూ, వైద్యపరీక్షలు చేయించి.. తిరిగి కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు.

ఇతడి పేరు గిడ్డయ్య స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని డోన్. 2018లో ఆశ్రమం ప్రారంభించిన తొలినాళ్లలో 44వ నెంబరు జాతీయరహదారిపై గొల్లపల్లి సమీపంలో రోడ్డుపై తిరుగుతుండగా ఆశ్రమ నిర్వాహకుడు



తీసుకువచ్చారు. నాటి నుంచి ఆశ్రమంలో యోగాసనాలు, ధ్యానంతో పాటు సైక్రియాట్రిస్ట్‌తో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. తన గ్రామం డోన్ అని చెప్పటంతో అక్కడి వారితో ఆరా తీసి కుటుంబసభ్యులకు అప్పగించారు. మూడు నెలలు బాగానే ఉన్నా.. సరైన చికిత్స లేకపోవడంతో తిరిగి మానసిక రుగ్మతకు గురయ్యాడు. మరోసారి ఆశ్రమానికి తీసుకురాగా.. 4 నెలల కాలంలోనే గిడ్డయ్య కోలుకున్నాడు. ప్రస్తుతం ఆశ్రమంలోనే ఉంటున్నాడు.

ఈమె పేరు బీబీ. ద్రోణాచలంలో మూడేళ్ల క్రితం రోడ్లపై సరైన దుస్తులు లేకుండా.. ఎక్కడపడితే అక్కడ తింటూ కాలం వెళ్లదీసేది. రోడ్డుపై మహిళ అలా తిరుగుతుండ



డాన్ని అక్కడి మహిళా న్యాయమూర్తి గమనించి ద్రోణాచలం సేవా సమితికి సమాచారం అందించారు. వారు ఇలాంటి వారిని జడ్చర్లలోని సత్యేశ్వర ఆశ్రమం చేరదీస్తుందని జడ్జికి వివరించారు. దీంతో ఆమె వెంటనే ఆశ్రమానికి పంపించారు. ప్రస్తుతం ఈ మహిళకు కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవటంతో స్వస్థత చేకూరినప్పటికీ ఆశ్రమంలోనే ఉంటుంది.



సత్యేశ్వర ఆశ్రమం





ఆశ్రమానికి నాంది ఇలా..

మహాలక్ష్మిసేవా ట్రస్టు వ్యవస్థాపకుడు చిత్తనూరి ఈశ్వర్ 10వ తరగతి చదువుతున్న సమయం 1970లో తన దూరబంధువైన ఓ వ్యక్తి మానసిక రుగ్మతతో బాధపడడం చూసి.. అలాంటి వారికి ఏదైనా చేయాలని సంకల్పించుకున్నారు. రోజు ఎక్కడో ఓ చోట రోడ్లపై అలాంటి మానసిక రుగ్మతతో బాధపడేవారు తారసపడుతూనే ఉన్నారు. అలాంటి సమయంలో ముంబయిలో శ్రద్ధ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ పత్వానీ దంపతులు మానసిక రుగ్మత కలిగిన వారికి చికిత్స అందించడం గురించి తెలుసుకొని అక్కడే ఉండి పరిశీలించి వచ్చారు. ఇదే క్రమంలో చౌటుప్పల్ వద్ద గడ్డిశంకర్ సొంతంగా అమ్మానాన్న ఆశ్రమాన్ని నెలకొల్పి మానసిక రోగులకు సేవచేయడం తెలిసి అక్కడే నాలుగు రోజులు ఉండి అవగాహన పెంచుకున్నారు. ఆ తర్వాత మానసిక అభాగ్యుల కోసం ఆశ్రమం పెట్టాలని నిర్ణయం తీసుకొని ఇద్దరు కుమారులు, కుమార్తె, భార్యకు చెప్పారు. కుటుంబసభ్యుల అందరి ఆమోదంతో తాను వివిధ వ్యాపారాల ద్వారా ఆర్జించిన ఆస్తిని ఐదు భాగాలుగా చేసి, మూడు భాగాలు పిల్లలకు ఒక భాగం తన పేరిట, మరో భాగం ఆశ్రమం పేరిట వీలునామా రాశారు. అనంతరం బాదేపల్లిలో అర ఎకరం పొలంలో శ్రీ సత్యేశ్వర ఆశ్రమాన్ని నెలకొల్పాడు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతున్న మానసిక దివ్యాంగులు ఆరుగురిని గుర్తించి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి 2018లో మహాశివరాత్రి రోజు ఆశ్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం 86 మందికి ఆశ్రయం కల్పించారు. 105 మందిని బాగు చేసి సొంతవారికి అప్పగించారు.

▪ ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రి సహకారంతో ప్రతి నెలా సైక్రియాట్రిస్టు వైద్యులు ఆశ్రమానికి వచ్చి చికిత్స అందిస్తున్నారు. ఎవరికైనా అత్యవసర పరిస్థితి ఉంటే వారికి ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. కరోనాకు ముందు ప్రతి నెలా వారిని హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించేవారు. కరోనా నుంచి వెళ్లటానికి ఇబ్బంది కలగటంతో ఆశ్రమ నిర్వాహకులు ఎస్‌వీఎస్ యాజమాన్యాన్ని సంప్రదించడంతో ఉచిత సేవలు అందిస్తున్నారు.

సండే స్పెషల్



ఆశ్రమం నాకు దేవాలయం



నేను ఎప్పుడు ఏం చేస్తున్నానో తెలియని పరిస్థితి. అలాంటి అయోమయస్థితిలో సత్యేశ్వర ఆశ్రమం గురించి తెలిసి నా భార్య స్వర్ణలత అక్కడ చేర్పించింది. రెండున్నరేళ్ల పాటు ఆశ్రమంలో ఉండి పూర్తిగా కోలుకున్నాను. మూడు నెలల కిందట స్వగ్రామం లక్నారానికి వెళ్లి అక్కడ కిరాణం నడుపుతున్నాను. సత్యేశ్వర ఆశ్రమం అనే బదులు దేవాలయం అనటం సబబుగా ఉంటుంది. ఆ ఆశ్రమం లేకుంటే నా పరిస్థితి ఊహించుకోవడానికే కష్టంగా ఉంది.

– సింహ్మాయ్య, ఆశ్రమంలో కోలుకున్న వ్యక్తి, లక్నారం, తెలకపల్లి మండలం

దైవకార్యంగా భావించి..



నాన్న మా కుటుంబ సభ్యులను అందరిని కూర్చోబెట్టి మానసిక రుగ్మతలు కలిగిన వారి కోసం ఆశ్రమం పెడతా అనగానే.. దైవకార్యంగా భావించి మేం అందరం ఏకగ్రీవంతో ఒప్పుకున్నాం. ఆశ్రమానికి మా వంతుగా సహకారం అందిస్తున్నాం. అన్ని విధాలుగా బాగున్న వారికి సహాయం చేయడం కంటే.. ఇలాంటి వారికి సేవ చేయటం మానవసేవయే మాధవసేవగా మా నాన్న చెబితే అది నిజమే అనిపిస్తుంది.

– చిత్తనూరి రామకృష్ణ, సత్యేశ్వర ఆశ్రమం నిర్వాహకులలో ఒకరు

చిన్నప్పుడే అనుకున్నా..

నా పదో తరగతిలోనే బంధువైన రఘుపతిపేట కాశీనాథ్ మానసిక రుగ్మతతో రోడ్లపై తిరుగుతూ మరణించడంతో ఆరోజే నా మనసులో బీజం పడింది. ఆ తరువాత అనేక కారణాలతో ఆలస్యం అయినప్పటికీ బాంబే శ్రద్ధ ఫౌండేషన్, చౌటుప్పల్ అమ్మానాన్న ఆశ్రమం స్ఫూర్తిగా ఆశ్రమం ప్రారంభించాను. నా కుటుంబసభ్యులు ఇందుకు ఆమోదం తెలపటం.. నేను వారికి రుణపడి ఉంటాను. ప్రభుత్వాలు స్పందించి మానసిక రుగ్మత కలిగిన వారి కోసం ఆశ్రమాలు కట్టించటం, ఆస్పత్రులు పెంచి సేవలందిస్తే బాగుంటుంది.

– చిత్తనూరి ఈశ్వర్, సత్యేశ్వర ఆశ్రమ నిర్వాహకుడు

పకడ్బందీగా ‘పది’ పరీక్షల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు: వచ్చే నెలలో నిర్వహించే పదో తరగతి పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పదో తరగతి పరీక్షలపై డీఈఓ గోవిందరాజులు అధ్యక్షతన కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి ఏప్రిల్ 13 వరకు నిర్వహించే పరీక్షలను అధికారులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించి విజయవంతం చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బస్సులను సకాలంలో నడపాలని, విద్యుత్ శాఖ పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు శానిటేషన్ చేపట్టాలని, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రస్తుతం పరీక్షల సీజన్ ప్రారంభం కానుందని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 61 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 295 పాఠశాలల నుంచి 10,650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, అందులో 78 మంది విద్యార్థులు ఇదివరకే పరీక్ష తప్పినవారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. సమావేశంలో డీపీఓ కృష్ణ, డీపీఆర్‌ఓ సీతారాం, ఆర్డీఓ ఎర్రిస్వామి, పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, ఆర్టీసీ డీఎం ధరంసింగ్, డీఎస్పీ మోహన్, విద్యుత్, పంచాయతీ, పోస్టల్ సూపరింటెండెంట్, పోలీస్, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేస్తే ప్రాణాల నిలుపుదల

నాగర్‌కర్నూల్: కోవిడ్ తర్వాత వయస్సుతో సంబంధం లేకుండా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారికి సీపీఆర్ చేయడం వల్ల కనీసం ప్రతి పది మందిలో ఐదుగురి ప్రాణాలు కాపాడవచ్చని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం ఆయన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ శాంతకుమారితో కలిసి కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీస్, మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సీపీఆర్ శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన వారిని త్వరలోనే జిల్లాలకు పంపిస్తామన్నారు. అలాగే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎస్ శాంతకుమారి ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పోడు భూముల పట్టాలు, ఆయిల్‌పాం సాగు లక్ష్యాలు చేరుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కంటివెలుగు విజయవంతంగా కొనసాగుతుందన్నారు. పోడు భూములు, భూసేకరణకు వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్పీ మనోహర్, అదనపు కలెక్టర్లు మనూచౌదరి, మోతీలాల్, డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో సామూహిక వ్రతాలు

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శనివారం పెద్దసంఖ్యలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు భక్తుల చేత సత్యనారాయణస్వామి మంత్రోచ్ఛరణ చేస్తూ వ్రతాలు జరిపించారు. అలివేలు మంగసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దంపతులు వ్రతాలు ముగించుకుని స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు →



తొలగిన అంధకారం

సాక్షి ఎఫెక్ట్..

కల్వకుర్తి: మున్సిపాలిటీలో ఎట్టకేలకు వీధిదీపాలు వెలిగాయి. గత కొన్ని రోజులుగా పట్టణ ప్రధాన రహదారిపై ఉన్న హైమాస్టు లైట్లు వెలగకపోవడంతో ‘అంధకారం’ శీర్షికన గత నెల 16న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ సత్యం చొరవ చూపి జాతీయ రహదారి కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. విద్యుత్ శాఖకు పెండింగ్‌లో ఉన్న రూ.22 లక్షల బిల్లులు చెల్లించేలా చూశారు. విద్యుత్ బిల్లులు


అంధకారం..!

చెల్లించిన తర్వాత హైమాస్టు లైట్లను మున్సిపాలిటీకి సదరు కాంట్రాక్ట్ సంస్థ వారు అప్పగించారు. దీంతో ప్రధాన రహదారిపై వీధిదీపాలు వెలగడంతో పట్టణ ప్రజల అంధకారానికి విముక్తి లభించినట్లయ్యింది.

ప్రతి ఒక్కరిపై భూమి సంరక్షణ బాధ్యత




నేల సంరక్షణ గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త

బిజినేపల్లి: నేల ఆరోగ్యం, నేలకు జరుగుతున్న కాలుష్య నష్టం గురించి తెలుసుకోవడంతోపాటు నేలను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అంతేకాక నేల విలువను ప్రతి విద్యార్థికి తెలియజేసి ఆ నేలను ఎలా సంరక్షించాలో చిన్ననాటి నుంచే వివరించాలని, లేకపోతే నేలకు నష్టం జరిగితే మనిషికి జరిగే నష్టం గురించి కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియపర్చాలని సూచించారు. శనివారం మండలంలోని పాలెం కేవీకేలో కేంద్ర మంత్రిత్వశాఖ, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా రాష్ట్రీయ ఆవిష్కార సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు భూసార పరీక్షలు, నేల విలువపై ఒకరోజు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేలను కృత్రిమ ఎరువుల, పరిశ్రమల కాలుష్యాల నుంచి సంరక్షించుకోవాలని, వాటిని ఉపాధ్యాయులు తమ బోధనల ద్వారా తెలియజేయాలన్నారు. మానవాళి వలన ఇప్పటికే నేలకు చాలా నష్టం జరిగిందని, తిరిగి ఆ నేలను మనమే ఆరోగ్యంగా తయారు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త విజయలక్ష్మి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,594

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగకి గరిష్టంగా రూ.7,594, కనిష్టంగా రూ.3,500 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,201, కనిష్టంగా రూ.2,011, పెబ్బర్లు గరిష్టంగా రూ.7,021, కనిష్టంగా రూ.4,239, కందులు గరిష్టంగా రూ.7,869, కనిష్టంగా రూ.7,829, ఆముదాలు రూ.6,440, పత్తి గరిష్టంగా రూ.7,409, కనిష్టంగా రూ.5,199 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,251గా ఒకే ధర నమోదైంది.



క్లుప్తంగా

ఉరేసుకుని డిగ్రీ విద్యార్థి బలవన్మరణం

నవాబుపేట: మండలంలోని కొత్తపల్లికి చెందిన విద్యార్థి మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొత్తపల్లికి చెందిన జంబుల నరేష్ (18) శుక్రవారం ఇంట్లో దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. వీరి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో పనిచేస్తుండగా, అన్నదమ్ములు ఆనంద్, నరేష్ కలిసి గ్రామంలోనే ఉంటున్నారు. నరేష్ జిల్లా కేంద్రంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తన కొడుకు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్న తండ్రి వెంకటయ్య, మృతిపై అనుమానం ఉందని శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్తులు, స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యాంలో పడి వృద్ధుడి మృతి


జయన్న(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది శివారులోని పెద్దవాగులో చేపల వేటకు వెళ్లి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. నిజాలాపూర్ చెందిన బుడుగజంగం జయన్న (65) శుక్రవారం సాయంత్రం పెద్దవాగులో సంకలమద్ది శివారులోని చెక్‌డ్యాం బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు బ్యాక్ వాటర్ నీటిలో మునిగిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో విషయం తెలియలేదు. శనివారం ఉదయం బ్యాక్ వాటర్‌లో మృతదేహం తేలడంతో జయన్నదిగా గుర్తించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు శంకర్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోల్తాపడిన ట్రాక్టర్ తండ్రి కళ్లెదుటే కొడుకు..



వంగూరు: మండలంలోని మిట్టసదగోడు – ఉల్పర మధ్య శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మిట్టసదగోడు నుంచి ఉల్పర వెళ్తున్న ట్రాక్టర్‌ను వెంకటయ్య, ఆయన కుమారుడు మధు (26) ఆపి ఎక్కారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో మధు ట్రాక్టర్ ట్రాలీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి వెంకటయ్య సురక్షితంగా బయటపడ్డాడు. గాయాలపాలైన ట్రాక్టర్ డ్రైవర్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ ఎక్కిన కొద్దిసేపటికే ప్రమాదం కావడంతో, తండ్రి కళ్ల ముందే కొడుకు మృతిచెందడంతో బంధువులు, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇందుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి..


భవాని (ఫైల్)

చిన్నచింతకుంట: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండ్రపల్లి చెందిన వాకిటి భవాని (25)ను దేవరకద్ర మండలం గూరకొండ చెందిన దాసరి యుగేందర్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తీరా మోసం చేశాడని తెలిసి మనస్తాపం చెంది గత నెల 24న ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. తండ్రి వాకిటి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొంతు కోసిన వ్యక్తి రిమాండ్

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో మహిళ గొంతు కోసిన దేవయ్యను శనివారం ఎస్‌ఐ షేక్ శంషోద్దీన్ రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల వద్ద గొంతుపై గాటుతో రోడ్డుపైకి వచ్చిన మహిళను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించిన విషయం విధితమే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, బాధిత మహిళ వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి దేవయ్యను గాలించి అరెస్టు చేశారు. దేవయ్య తనను లైంగికంగా వేధించాడని, నిరాకరించడంతో బ్లేడుతో గొంతు కోసి హత్యాయత్నం చేయబోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ..?

- గ్రామాలకు సరైన బస్సు సౌకార్యమే లేదు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


బూడ్డిపాడులో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మానవపాడు/ అయిజ: రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ ఉన్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలకు నేటికీ సరైన బస్సు సౌకర్యం లేదన్నారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర శనివారం మండలంలోని బూడ్డిపాడు, కలుకుంట్ల, శ్రీనగర్, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ ప్రజల సమస్యలు తీరాలంటే కేవలం బీఎస్పీతోనే సాధ్యమన్నారు. బూడ్డిపాడులో ఏసమ్మ అనే మహిళ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబ విద్యార్థులకు ఆయన తోడుగా ఉంటాడని చెప్పారు. ప్రతిఒక్కరూ బహుజన సమాజ్‌పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.

అలంపూర్‌లో దయనీయ పరిస్థితులు

రాష్ట్రంలోనే అలంపూర్ నియోజకవర్గం అన్నివిధాలుగా వెనకబడి అత్యంత దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం అయిజలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు రోజులుగా ఇక్కడ పర్యటిస్తున్నానని, కానీ, నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలతో పాటు మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైయినేజీలు కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సరైన వసతులు లేక విద్యార్థులు చదువులపై దృష్టిపెట్టడం లేదన్నారు. అలంపూర్ ప్రజల నుంచి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నా.. ఎందుకు అభివృద్ధికి నిధులు వెచ్చించడం లేదని ప్రశ్నించారు. ఇక్కడ వసూలు చేసిన నిధులన్నీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల నియోజకవర్గాలకు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అలంపూర్‌లో ఏడు శతాబ్దాల క్రితం నిర్మించిన బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శ్రీశైలం డ్యాం నుంచి రక్షించేందుకు కోటగోడ నిర్మించి నిలిచిన వరదను ఎత్తిపోసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. వరద నీటి స్థానంలో ఇప్పుడు మురుగు పారుతుందని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులు ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కేశవరావు, అలంపూర్ ఇన్‌చార్జ్ మధుగౌడ్, కనకంబాబు, సురేష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

61ఏళ్ల బాడీబిల్డర్

- వైద్యంతో పాటు బాడీబిల్డింగ్‌లో ప్రతిభ
- మాస్టర్స్‌లో పలుసార్లు మిస్టర్ తెలంగాణ
- మధ్యప్రదేశ్‌లో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటున్న ప్రేమ్‌కుమార్


బాడీబిల్డర్ డాక్టర్ ప్రేమ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: 61 ఏళ్ల వయస్సులో ఇష్టంగా బాడీబిల్డింగ్ చేస్తూ యువతకు, సీనియర్ సిటిజన్లకు జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ప్రేమ్‌కుమార్ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 40 ఏళ్ల నుంచి ప్రతి రోజు వ్యాయామం చేస్తూ చలాకీగా, ఆరోగ్యంగా ఉంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు. గత నెల 26న ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి పట్టణంలో రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో మాస్టర్స్ విభాగంలో మిస్టర్ తెలంగాణగా నిలిచారు. ప్రేమ్స్ హెల్త్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో 30 ఏళ్ల నుంచి పలువురికి ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తు వైద్య సేవలు అందిస్తున్నారు.

సాధించిన విజయాలు

ఈయన బాడీబిల్డింగ్ మొదలుపెట్టినప్పటి నుంచి పోటీల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ బాడీబిల్డింగ్ పోటీల్లో మాస్టర్స్ విభాగంలో పలు 'మిస్టర్ తెలంగాణ' టైటిల్ సాధించారు. 2008లో కర్ణాటక రాష్ట్రం హుబ్లీ, 2009లో ఖమ్మం, 2015లో ఛత్తీస్‌ఘడ్‌లో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2010 ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జాతీయస్థాయి మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీల్లో మాస్టర్స్ విభాగంలో ఆరోస్థానం, గతేడాది పుదుచ్చేరిలో జాతీయ పోటీల్లో ఐదోస్థానంలో నిలిచారు. అమలాపురం, మీరట్, పంజాబ్ లుథియానాలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాట్లంలో శనివారం నుంచి రెండు రోజులపాటు మిస్టర్ ఇండియా జాతీయ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ మాస్టర్స్ విభాగంలో పాల్గొంటున్నారు.

బాడీబిల్డింగ్ ఎంతో ఇష్టం..

బాడీ బిల్డింగ్ అంటే ఎంతో ఇష్టం. 40 ఏళ్ల నుంచి రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తున్నాను. మొదట్లో కుండల్లో ఇసుక, సిమెంట్‌తో తయారుచేసిన డంబెల్స్‌తో వ్యాయామం చేసేవాడిని. వ్యాయామంతోపాటు ప్రేమ్స్ హెల్త్‌క్లబ్‌ను ఏర్పాటు చేసి పలువురికి ఉచితంగా యోగా నేర్పిస్తున్నా.

– డాక్టర్ ప్రేమ్‌కుమార్, బాడీబిల్డర్, మహబూబ్‌నగర్

అనాథలుగా మారిన చిన్నారులు

- గతేడాది రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి
- తాజాగా తండ్రి బలవన్మరణం


అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు


బాలయ్య (ఫైల్)

లింగాల: ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇప్పుడు ఆర్థిక సమస్యలతో తండ్రి బలవన్మరణానికి పాల్పడడంతో వారి ఇద్దరు కుమారులు అనాథలుగా మిగిలిపోయారు. మండల కేంద్రం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ పల్లె నిరంజన్‌కు పల్లె బాలయ్య, పల్లె నాగరాజు ఇద్దరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు బాలయ్య (32), కోడలు పల్లె గీత జీవనోపాధికై రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఏడాది క్రితం రాఖీ పండుగ రోజు భార్యాభర్తలు బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గీత మృతి చెందింది. దీంతో బాలయ్య తనకున్న ఇద్దరు కుమారులు నాని, కన్ని తండ్రి వద్ద ఉంచి ఒక్కడే హైదరాబాద్‌లో జీవనం కొనసాగిస్తున్నాడు. ఓ వైపు భార్యను కోల్పోవడం, మరో వైపు ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం హైదరాబాద్‌లోని అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా శనివారం దుర్వాసన రావడంతో ఇంటి యజమానులు పరిశీలించగా సంఘటన వెలుగు చూసింది. మృతుడు వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను, స్నేహితులను కలిసి సరదాగా గడిపాడు. ఇద్దరు కుమారులకు అడిగింది కొనిచ్చి తిరిగి వెళ్లి పోయినట్లు కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. అంతలోనే ఇలాంటి వార్త వినాల్సి వచ్చిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. మృతునికి ఎలాంటి స్థిర, చరాస్తులు లేవని, అనాథలైన ఇద్దరు పిల్లల్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థినులను వేధిస్తున్న ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం చెందిన రామకృష్ణ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పదో చదువుతున్న విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలియడంతో శనివారం తల్లిదండ్రులు, బంధువులతో కలిసి పాఠశాలలో దేహశుద్ధి చేశారు. ఈయన మండల కేంద్రంలో చాలా పాఠశాలల్లో పనిచేశాడని, ఈయన అసభ్య ప్రవర్తన వల్ల పాఠశాలల యాజమాన్యం ఆయనను విధుల నుంచి తొలగించారని పలువురు తెలిపారు.

తప్పిపోయిన వివాహిత ఆచూకీ లభ్యం

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ సమీపంలో శుక్రవారం టీ స్టాల్ నుంచి తప్పిపోయిన గుడిగాన్‌పల్లి చెందిన కుమ్మరి కవిత తప్పింపోయింది. శనివారం మండల కేంద్రం శివారులోని రామసిపల్లి మైసమ్మ గుడి వద్ద ఆమె కనిపించడంతో కుటుంబ సభ్యులకు అప్పగించిన్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. ఈమె మున్ననూర్, వాడ్యాల్, వేముల గ్రామాల గుండా నడుచుకుంటూ మండల కేంద్రం సమీపానికి వచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తప్పిపోయిన అమ్మాయి అప్పగింత

పాలమూరు: దేవరకద్ర మండలంలోని గురుకొండ చెందిన మూగ, చెవిటి ఉన్న అమ్మాయి రెండేళ్ల కిందట తప్పిపోయింది. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు మహారాష్ట్రలో రెస్క్యూ చేసి తీసుకువచ్చారు. అమ్మాయిని శనివారం జిల్లా కోర్టులో కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మళ్లీ హైనాల కలకలం


మృతిచెందిన మేకను పరిశీలిస్తున్న కాలనీవాసులు

- భయాందోళన చెందుతున్న జడ్చర్ల వాసులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మరోసారి హైనాలు కలకలం రేపాయి. మంగళవారం రాత్రి ఒక హైనా దాడిలో 9మేకలు మృత్యువాతపడిన ఘటన మరవకముందే శనివారం సాయంత్రం మరోసారి రెండు హైనాలు రావడంతో భయాందోళనలకు గురిచేస్తుంది. రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో మాంసం విక్రయదారుడు అశోక్ శనివారం 10 మేకలను తీసుకువచ్చి 4గంటల సమయంలో కాంపౌండ్‌లో ఉంచాడు. రాత్రి ఇంటికి తీసుకెళ్దామని సమీపంలోనే ఉన్న తన ఇంటివద్దకు వెళ్లాడు. సాయంత్రం 6:30 గంటల సమయంలో రెండు హైనాలు మేకలు ఉన్న కాంపౌండ్‌లోకి వచ్చి వాటిపై దాడికి యత్నించాయి. మేకల అరుపులతో గమనించిన అశోక్ మరికొందరు కర్రలతో హైనాలను బెదిరించేందుకు ప్రయత్నించారు. దాంతో మేకలను వదిలిన హైనాలు వారిపైకి వచ్చేందుకు యత్నించాయి. అయినా వారు బెదరకుండా కర్రలతో దాడికి యత్నించటంతో అవి పారిపోయాయి. అప్పటికే ఒక మేకను రెండు హైనాలు పట్టుకుని రక్తం పీల్చటంతో అది మృత్యువాత పడింది. మంగళవారం రాత్రి ఒక హైనా, శనివారం సాయంత్రం రెండు హైనాలు ఒకే ప్రాంతంలోకి రావటంతో ఆప్రాంత వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. మేకలు ఉండే చోటును పసిగట్టిన హైనాలు ఇదే ప్రాంతంలో సంచరిస్తుంటాయన్న సందేహాలు కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు హైనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిజ్వారంలో చిరుత సంచారం?

- చిరుత కాదంటున్న అటవీశాఖ అధికారులు


బిజ్వారం సమీపంలో పంట పొలాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మల్దకల్: మండలంలోని బిజ్వారం పరిసరాల్లో చిరుత సంచరిస్తుందంటూ వదంతులు వచ్చాయి. దీంతో రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. శనివారం ఉదయం పంటలో చిరుతను పోలిన జంతువు ఒకటి సంచరిస్తూ కన్పించింది. చుట్టు పక్కల రైతులు కలిసి కేకలు వేయడంతో ఆ జంతువు అక్కడి నుంచి పారిపోయినట్లు రైతులు తెలిపారు. ఆ జంతువు చిరుతను పోలి ఉందని, కాలి ముద్రలు కూడా చిరుత మాదిరిగానే ఉండడంతో రైతులు మరింత ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు రాఘవేంద్ర, ప్రసూన బిజ్వారం చేరుకుని రైతు పొలం పరిసరాలను పరిశీలించారు. పరిసరాల్లో జంతువు సంచారానికి సంబంధించిన పాదముద్రలను పరిశీలించారు. చిరుత కాదని, చిరుతను పోలిన హైనా లేక నక్క అయి ఉండవచ్చునని వారు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, పొలాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. చిరుత ఈ ప్రాంతంలో సంచరించే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన చారకొండ మహేష్ తన ఇంట్లో అక్రమంగా 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడు. సమాచారం అందడంతో పరిశీలించి రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేట్ ఫొటోలు లీక్ చేస్తానని మహిళ బెదిరింపు

- రూ.1.80లక్షలు ముట్టజెప్పిన యువకుడు

జడ్చర్ల: డబ్బులు ఇవ్వకుంటే నీకు సంబంధించిన ప్రైవేట్ ఫొటోలు లీకు చేస్తానని ఓ మహిళ ఫోన్‌లో యువకుడిని బెదిరించింది. దీంతో ఆ యువకుడు భయపడి విడతల వారీగా డబ్బులను ఆన్‌లైన్‌లో పంపించారు. సంఘటన సంబంధించి సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు ఎస్.అఖిలేష్‌కుమార్ పట్టణంలోని కావేరమ్మపేటలో నివాసం ఉంటున్నాడు. గతేడాది నవంబర్ 15న 8240808529 నంబర్ నుంచి ఓ మహిళ ఫోన్ చేసింది. ఫోన్ పే ద్వారా డబ్బులు పంపకుంటే నీకు సంబంధించిన ప్రైవేట్ ఫొటోలు లీకు చేస్తానని తెలిపింది. యువకుడు భయపడి విడలత వారీగా రూ.1,80,555 పంపాడు. ఆ తర్వాత మోసపోయానని గ్రహించి శనివారం జడ్చర్ల పోలీసులను ఆశ్రయించారు. యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

'వర్క్ ఫ్రం హోం' పేరుతో మోసం

జడ్చర్ల: వర్క్ ఫ్రం హోం పేరుతో మొబైల్‌లో మెసేజ్ రాగా, లింక్‌ను క్లిక్ చేయడంతో నగదు పోగొట్టుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జయప్రకాశ్‌నగర్‌కు చెందిన సి.వినీత గృహిణిగా ఉంది. జనవరి 30న 9630792655 నంబర్ నుంచి వర్క్ ఫ్రం హోం అనే మెసేజ్ తన మొబైల్‌కు వచ్చింది. అందులో ఉన్న లింకు ఓపెన్ చేసి చూడగా ఇన్విటేషన్ నంబర్10యూఈ44ఎం డబ్ల్యూ912టీ ఉంది. ఈ కోడ్‌ను ఫాలో అవుతూ వారు చెప్పినట్లు చేయగా తన బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా మొత్తం రూ.1.90 లక్షలు డ్రా అయ్యాయి. ఆ తర్వాత స్పందన లేకపోవడంతో బాధితులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉన్న చోటే కుప్పకూలిన కానిస్టేబుల్

- ఫిర్యాదు విచారిస్తుండగా ఘటన
- హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల: ఫిర్యాదును విచారించేందుకు సంఘటన స్థలానికి వెళ్లిన కానిస్టేబుల్ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శనివారం పట్టణంలో చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు శనివారం డయల్ 100కు ఫిర్యాదు వచ్చింది. స్థానిక అశోక్‌నగర్‌లో ఫిర్యాదును విచారించేందుకు మండలంలోని గొల్లోనిదొడ్డితండాకు చెందిన కానిస్టేబుల్ చందర్‌నాయక్ తన బైక్‌పై సంఘటన స్థలానికి వెళ్లాడు. అక్కడ ఫోన్ మాట్లాడుతుండగానే ఒక్కసారిగా చేతిలో ఉన్న ఫోన్‌ను విడిచిపెట్టి కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ, సిబ్బంది పోలీస్ వాహనంలో చికిత్స కోసం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించి హైదరాబాద్‌కు సిఫార్సు చేశారు. సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పిందని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు.

జూరాల వద్ద వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ కర్నె శేఖర్‌రెడ్డి

ధరూరు: జీవితంపై విరక్తి చెందిన మహిళ జూరాల కుడి కాల్వలో దూకేందుకు ప్రయత్నించింది. వివరాల్లోకి వెళితే.. అమరచింత మండలం చంద్రఘడ్‌కు చెందిన రాణమ్మ శనివారం మధ్యాహ్నం జూరాల ప్రాజెక్టు కుడి కాల్వకు వద్దకు చేరుకుని దూకేందుకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న బ్లూకోల్ట్ సిబ్బంది తిరుమలేష్, శ్రీనివాసులు పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. తనకు భర్త లేడని, ఆరోగ్యం సహకరించకపోవడంతో చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఎస్‌ఐ కర్నె శేఖర్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పజెప్పి స్వగ్రామానికి పంపించారు.

యువకుల మధ్య ఘర్షణ

- ఇద్దరికి కత్తిపోట్లు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో శనివారం రాత్రి యువకులు ఘర్షణకు దిగగా ఇద్దరు కత్తిపోట్లకు గురయ్యారు. హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మధనాగుల సాయిబాబు, అతని బావ వెల్దండకు చెందిన జిల్లెల వెంకటేష్ ఇద్దరు బైక్‌పై కేక్ కోసం బేకరి వద్దకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా చౌరస్తా వద్ద సామ తేజ వారిపై చేయి లేపాడు. ఆ సమయంలో బైక్‌పై ఉన్న శేఖర్, మరో యువకుడు చేయి ఎందుకు అడ్డుపెడుతున్నావని అంటూ ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత సామ తేజ, శేఖర్‌కు ఫోన్ చేసి రమ్మన్నాడు. తిరిగి బైక్‌పై సాయిబాబు, వెంకటేష్ రాగా అప్పటికే కత్తితో ఉన్న తేజ వారిని పొడిచాడు. సాయిబాబుకు వెన్నుభాగం, ఎడమ భుజం వద్ద గాయంకాగా, వెంకటేష్‌కు చేతికి గాయమైంది. వారిని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సామ తేజను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రెండు ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని దుందుబీవాగు నుంచి శనివారం తెల్లవారుజామున అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. పట్టుబడిన టిప్పర్లు అయ్యవారిపల్లి చెందినవిగా గుర్తించామని, అలాగే శనివారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లి శివారులోని దుందుబీవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

'అపాచీ' మరో 100 మిలియన్ డాలర్లు

10 వేల ఉద్యోగాల కల్పన



(విశాఖపట్నం లోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు అపాచీ ఇండియా డైరెక్టర్ సెర్గియో లీ వెల్లడించారు. మరో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తద్వారా 10 వేల ఉద్యోగాలను కల్పించనున్నట్లు చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపాచీకి చైనా, భారత్, వియత్నాంలో ప్లాంట్లు ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్లాంటే అతి పెద్దదని వివరించారు. ఏపీలో ప్లాంట్‌పై ఇప్పటిదాకా 100 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అత్యంత తక్కువ వ్యవధిలోనే తమకు అనుమతులు లభించినట్లు గుర్తు చేసుకున్నారు. సింగిల్ విండో క్లియరెన్స్‌తో పాటు సంస్థ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును ప్రభుత్వం అందించిందన్నారు. వైఎస్సార్ దార్శనికతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తోందని ప్రశంసించారు.

ఆరోగ్య రంగంలో ఆదర్శ రాష్ట్రం

డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి



హెల్త్‌కేర్ విభాగంలో దేశానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఔషధ రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు సానుకూలాంశాలతో పెట్టుబడులకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోందని చెప్పారు. పారిశ్రామికంగానే కాకుండా రాష్ట్రం సామాజికంగా పురోగమించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో రాష్ట్రం వివిధ రంగాల్లో పటిష్టంగా ముందుకెళుతోందని ప్రశంసించారు. లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు) రంగంలో భారత్‌కు అపార వ్యాపార అవకాశాలున్నాయని సతీష్‌రెడ్డి తెలిపారు. మెడ్‌టెక్ జోన్‌తో మరిన్ని పెట్టుబడుల రాకకు అవకాశాలున్నాయని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పెట్టుబడుల సదస్సు సూపర్ హిట్

దేశ పారిశ్రామిక దిక్సూచి ఏపీ అంటూ కార్పొరేట్ దిగ్గజాల ప్రశంసలు

- రెండు రోజుల్లో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు
- 378 ఒప్పందాల ద్వారా 6.09 లక్షల మందికి ఉపాధి
- రెండవ రోజు రూ.3,841 కోట్ల విలువైన 14 యూనిట్లు ప్రారంభం
- ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తేవడానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని అపారమైన అవకాశాలను వివరిస్తూ 'అడ్వాంటేజ్ ఏపీ'పేరుతో విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ హిట్ అయ్యింది. దేశ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు ఒకే వేదికపైకి రావడమే కాకుండా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులను పెడుతూ ఒప్పందాలు చేసుకున్నారు. రెండు రోజుల సమావేశాలకు రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముఖేష్ అంబానీతో పాటు కరణ్ అదానీ, జిందాల్, భంగర్, ఒబెరాయ్, భజాంకా, దాల్మియా, మిట్టల్, జీఎంరావు, కృష్ణ ఎల్లా, అపోలో ప్రీతా రెడ్డి, సతీష్ రెడ్డి, బీవీఆర్ మోహన్ రెడ్డి, మషాహిరో యమాగుచి, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్ వంటి 30కిపైగా కార్పొరేట్ దిగ్గజాలు హాజరయ్యారు. అంబానీ మొదలు రాష్ట్రంలోని పారిశ్రామికవేత్త వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చుకోవడమే కాకుండా అందులో భాగస్వామ్యమవుతామంటూ ప్రకటించారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో 20 రంగాల నుంచి రూ.13,41,734 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. 378 ఒప్పందాల ద్వారా రాష్ట్ర యువతకు ప్రత్యక్షంగా 6,09,868 ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గత ప్రభుత్వాల వలే ప్రచారం కోసం ఒప్పందాలు కుదుర్చుకొని వదిలేయకుండా వాటిని తక్షణం అమల్లోకి తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి.. సీఎస్ అధ్యక్షతన ఒప్పందాల పర్యవేక్షణ కమిటీ వేశారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఒప్పందాల అమలు తీరు, అనుమతుల మంజూరు వంటి అంశాలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటుందని సీఎం ప్రకటించడంపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అర్థవంతమైన చర్చలు

ఈ సమావేశాల సందర్భంగా 15 రంగాలపై అర్థవంతమైన చర్చలు జరిగాయి. ఇందులో ఆయా రంగాలకు చెందిన 100 మందికిపైగా ప్రముఖ నిపుణులు పాల్గొని చర్చించారు. పలు దేశాల్లో ఉన్న పరస్పర పెట్టుబడుల అవకాశాలపై వియత్నాం, నెదర్లాండ్స్, యూఏఈ, వెస్ట్రన్ ఆస్ట్రేలియా దేశాలతో కంట్రీసెషన్స్ జరిగాయి. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వివిధ అంశాలపై చర్చలు జరిపారు. రాష్ట్రంలోని పెట్టుబడులు, ఉత్పత్తులు, ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేలా 137 స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఒక జిల్లా ఒక ఉత్పత్తి పేరుతో జిల్లాల వారీగా ఎగుమతులను ప్రోత్సహిస్తున్న ఉత్పత్తుల స్టాల్ విశేషంగా ఆకర్షించింది. 25 దేశాల నుంచి 46 మంది రాయబారులతో పాటు మొత్తం 14,000కు పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

14 యూనిట్లు ప్రారంభం

రాష్ట్రంలో వాణిజ్యపరంగా ఉత్పత్తికి సిద్ధమైన 14 యూనిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శరబానంద సోనావాల్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ యూనిట్ల ప్రారంభం ద్వారా రూ.3,841 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపంలోకి రావడమే కాకుండా 9,108 మందికి ఉపాధి లభించనుంది. క్లింబెర్లీ క్లార్క్, బ్లూస్టార్, అంబర్, హావెల్స్, ఎక్సలెంట్ ఫార్మా, ఎస్‌జీసీ టాన్స్‌మిషన్స్, చార్ట్ ఇండస్ట్రీస్, లారస్ ల్యాబ్, అమరా లైఫ్, శారదా ఫెర్రో అల్లాయిస్, విన్‌విన్ స్పెషాలిటీ, ఏవోపీ ఆగ్రో ఫుడ్స్, ఎస్‌హెచ్ ఫుడ్, అవేరా కంపెనీలున్నాయి.

'దివీస్' మరో రెండు ప్లాంట్లు

సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడి



ఫార్మా దిగ్గజం దివీస్ ల్యాబొరేటరీస్ ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు యూనిట్లు నెలకొల్పనుంది. ఇందుకు దాదాపు రూ.1,480 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే రూ.780 కోట్ల ప్రతిపాదన ఆమోదం పొందగా కొత్తగా మరో రూ.700 కోట్ల ప్రతిపాదనలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అదనంగా 22 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందని దివీస్ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు వెల్లడించారు. కాకినాడలో రెండో దశ కింద ఒక యూనిట్, కృష్ణపట్నం దగ్గర మరొక దివీస్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి ఎగుమతి ఆధారిత యూనిట్లుగా (ఈవోయూ) ఉంటాయని వివరించారు. కొన్ని సమస్యల వల్ల కాకినాడ యూనిట్ పనులు గతంలో ముందుకు సాగలేదని, అవి పరిష్కారం కావడంతో రెండో దశ పనులు చేపట్టడానికి మార్గం సుగమమైందని చెప్పారు. మిగతా ప్రక్రియ పూర్తయితే రెండేళ్లలోగా ఇది అందుబాటులోకి వస్తుందని తెలిపారు.



హెటిరో గ్రూప్ ఎండీ డాక్టర్ బండి వంశీ కృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న కిషన్ రెడ్డి, సీఎం జగన్

రెండేళ్లలో రూ. రెండు వేల కోట్లు

భారత్‌ను ఫార్మా స్యూటికల్ రంగంలో భాగస్వామిగా చేసుకునేందుకు అనేక దేశాలు పోటీ పడుతున్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇప్పటికే ఫార్మా రంగంలో ఏపీ తనదైన ముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, చూపిస్తున్న చొరవ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం కారణంగా ఏపీ వైపు చూస్తున్నాం. రాబోయే రెండేళ్లలో ఏపీలో రూ.2 వేల కోట్లు పెట్టుబడులు పెడతాం. దీని ద్వారా కనీసం 3,000 మందికి ఉపాధి లభిస్తుంది.

– వంశీకృష్ణ బండి, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ

మహిళా సాధికారతపై మరింత దృష్టి: సుచిత్రా ఎల్లా



మహిళా వ్యాపారవేత్తల సాధికారతపై భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) మరింతగా దృష్టి పెడుతోందని భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా తెలిపారు. ఇందుకోసం మరిన్ని సీఐఐ చాప్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ విషయాలు చెప్పారు. స్వల్ప వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో అత్యంత వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని సుచిత్రా ఎల్లా తెలిపారు. ఈ నేపథ్యంలో పలు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అభినందించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికి సీఐఐ నుంచి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తామని సుచిత్రా ఎల్లా చెప్పారు.

పారిశ్రామిక హబ్‌గా ఏపీ

రాష్ట్రం పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానం

- జీఐఎస్ ముగింపు సమావేశంలో సీఎం వైఎస్ జగన్



విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు రాష్ట్రాన్ని ఆకర్షణీయ గమ్యస్థానంగా నిలుపుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల వృద్ధికి కృతనిశ్చయంతో ఉన్న తమ ప్రభుత్వం.. అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పిస్తుందని పారిశ్రామికవేత్తలకు భరోసానిచ్చారు. కరోనా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని మూడున్నరేళ్లలో ఆర్థికాభివృద్ధి సాధించడం తమ ప్రభుత్వ ఘనత అని చెప్పారు. కీలక సమయంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన 378 ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో 6.09 లక్షల మందికి ఉద్యోగాలు లభించనుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల మేరకు పరిశ్రమలను స్థాపించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023'రెండవ రోజు శనివారం ముగింపు సమావేశంలో దేశీయ, అంతర్జాతీయ అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- అత్యంత కీలక సమయంలో ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహించాం. దేశ, విదేశీ పారిశ్రామికవేత్తల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను అనుకూల గమ్యస్థానంగా నిలపడంలో ఈ సమ్మిట్ విజయం సాధించింది.
- ఆటోమొబైల్, ఈవీ సెక్టార్, హెల్త్ కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, అగ్రి ప్రాసెసింగ్, టూరిజం తదితర రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను సదస్సులో విశదీకరించారు. మరిన్ని రంగాల్లో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలను అన్వేషించేందుకు యూఏఈ, నెదర్లాండ్స్, వియత్నాం, వెస్ట్రన్ ఆస్ట్రేలియాలను భాగస్వాములుగా చేసుకుని మరో నాలుగు సెషన్లు కూడా నిర్వహించాం.
- రెండు రోజుల సదస్సులో రూ.13,41,734 కోట్ల విలువైన పెట్టుబడులతో 378 ఎంఓయూలు కుదిరాయి. వీటి వల్ల మొత్తం 6,09,868 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఐటీ, ఐటీ ఆధారిత రంగాలకు సంబంధించి 82 ఒప్పందాలు చేసుకున్నాం. వీటి విలువ రూ.73,819 కోట్లు. దాంతో 1,40,002 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రెండో రోజు సదస్సులో భాగంగా రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులతో 286 ఎంఓయూలు చేసుకున్నాం. వీటి ద్వారా సుమారు 2.09 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
- పరిశ్రమలు స్థాపించేలా పర్యవేక్షించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసే ఈ కమిటీలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఈ సదస్సులో కుదిరిన ఎంవోయూల అమలు దిశగా చర్యలు తీసుకుంటుంది.
- రూ.3,841 కోట్లతో స్థాపించిన 14 పారిశ్రామిక యూనిట్లను ఈ సమ్మిట్ వేదిక నుంచి ప్రారంభించాం. వాటితో 9,108 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కింబర్లే క్లార్క్, బ్లూస్టార్, క్లెమైటిక్, లారస్ ల్యాబ్, హేవెల్స్ ఇండియా, శారదా మెటల్స్, అల్లాయిస్ తదితర కంపెనీలు ఈ పెట్టుబడులు పెట్టాయి.

ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఏపీకి అపార అవకాశాలు

కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి): ఆత్మనిర్భర్ భారత్ విధానంలో భాగంగా కేంద్రం 14 కీలక రంగాల్లో ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకాలను అమలు చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆహార ఉత్పత్తులు, వైద్య పరికరాలు మొదలైనవి వీటిలో ఉన్నాయని చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కి ఉన్న సానుకూలతల దృష్ట్యా మెరైన్ ఉత్పత్తులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, ఇంజనీరింగ్ ఉత్పత్తులు మొదలైన విభాగాల్లో వృద్ధి చెందడానికి రాష్ట్రానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేయడం ద్వారా అభివృద్ధిలో ఏపీ కొత్త గరిష్ట స్థాయిలను చేరుతుందని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రాలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్న నేపథ్యంలో ఈ తరహా సహకారం కీలకంగా ఉంటుందన్నారు.

అలంపూర్‌లో ఏపీ హైకోర్టు జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి శ్రీనివాస్‌రెడ్డి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ క్షేత్రాన్ని ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ సన్నిధిలో పూజలు చేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను తెలియజేసి, తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

హనుమత్ వాహనంపై రంగనాథుడి ఊరేగింపు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం కొనసాగాయి. ఉదయం వేదపండితులు యాగశాలలో శ్రీవారి మూలమంత్ర హోమం, బలిహరణం చేశారు. రాత్రి హనుమత్ వాహనసేవ, గోదాదేవి అమ్మవారికి మంటపోత్సవం నిర్వహించారు. హనుమత్ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని తిరువీధుల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవిందనామ స్మరణతో దర్శించుకున్నారు. ఆదివారం స్వామి వారికి గజవాహన సేవ నిర్వహించనున్నారు.



సరిహద్దు జిల్లా పోలీసుల సమావేశంలో మొక్కకు నీరు పోస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కందూర్‌లో బ్రహ్మోత్సవాలు ఆరంభం



ఆలయంలో అలంకరణలో శివలింగం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న పండితులు

అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆలయంలోని శివలింగాన్ని అలంకరించి అభిషేకం చేశారు. యాగశాలలో భూతబలి కార్యక్రమం చేసి యాగశాల ప్రవేశం చేపట్టారు. తర్వాత విఘ్నేశ్వర పూజ, అగ్నిప్రతిష్ఠ, అంకురారోహణ, ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలను చేపట్టారు. గో పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్థాపన చేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం ఉదయం ఆలయంలో పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ తెలిపారు. కల్యాణానికి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయంలో ఇప్పటికే చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు.



గో పూజతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న పూజారులు

ఆధునిక టెక్నాలజీదే భవిష్యత్

- రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ ప్రకాష్‌రావ్

రాజాపూర్: భవిష్యత్‌లో ఆధునిక టెక్నాలజీ ఎంతో అవసరమని, రోబస్ట్ టెక్నాలజీపై మంచి పట్టు ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఉమ్మడి ఏపీ రిటైర్డ్ హైకోర్ట్ జస్టిస్ ప్రకాష్‌రావ్ పేర్కొన్నారు. శనివారం పోలేపల్లి సెజ్‌లోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో నిర్వహించిన వివిధ పరిశ్రల హెచ్‌ఆర్‌డీ కన్క్లేవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు అంతర్ దృష్టితో కూడిన ఆలోచనలు, అభిప్రాయాలు తనను ఎంతో సంతృప్తి పరిచాయన్నారు. కాలంచెల్లిన ప్రక్రియలు, వ్యవస్థలు వ్యక్తులను పునరుద్ధరించడం ద్వారా తమ వినియోగదారులకు అత్యంత సంతృప్తిని ఇవ్వాలనే కంపెనీలు బలమైన సాంకేతికతకు అనుగుణంగా మారడం అత్యవసరమన్నారు. 2020లో కార్మిక చట్టాల సమూల మార్పులు చేసి కొత్త చట్టాలను తీసుకువచ్చారన్నారు. న్యాయ వ్యవస్థలో టెక్నాలజీ కొంతవరకే పరిమితం అవుతుందని తెలిపారు. విద్యార్థులు మార్కెట్‌లోని పోకడల గురించి తెలుసుకోవాలని, పాఠ్యపుస్తకాలు ఎల్లప్పుడు బోధించలేని సమాచారం లభిస్తుందన్నారు. సెమినార్‌లో ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సిద్దార్థగోష్, డిప్యూటీ రిజిస్టర్ మహేష్‌కుమార్, ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు మాధవిలత, విశాక్ భరద్వాజ్, మంజునాథ్, సన్‌దీప్, సుజాద్‌బిన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రకాష్‌రావ్ తదితరులు

భూగర్భ కేంద్రంలో జాతీయ భద్రతా వారోత్సవాలు

దోమలపెంట (అచ్చంపేట): టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో జాతీయ భద్రతా వారోత్సవాలను శనివారం సీఈ సూర్యనారాయణ జెండా ఎగురేసి ప్రారంభించారు. ఫ్యాక్టరీ మేనేజర్, డీఈ శ్రీకుమార్‌గౌడ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్ల చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారం రోజులుపాటు నిర్వహించే కార్యక్రమాల్లో అందరూ పాల్గొని అవగాహన పెంచుకోవాలన్నారు. తొలి రోజు భద్రతకు సంబంధించిన పోస్టర్లను, విధుల్లో ఉపయోగించాల్సిన పరికరాలను ప్రదర్శించారు. తదుపరి కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రత కమిటీతో నిర్వహించారు. జెన్‌కో (హెచ్‌పీసీ, విద్యుత్ సౌధ) సద్గుణకుమార్, కేంద్రం ఎస్ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ (సివిల్) రవీంద్రకుమార్, ఎస్ఎఫ్ఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న సీఈ సూర్యనారాయణ

పరస్పర సహకారంతోనే నేర నియంత్రణ

నారాయణపేట రూరల్: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల పోలీసులు సహకరించుకుంటేనే నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని ఎస్పీ వేదమూర్తి అభిప్రాయపడ్డారు. శనివారం యాద్గీర్ జిల్లాలో నిర్వహించిన ఇరు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశంలో జిల్లా నుంచి డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, అక్రమ రవాణాపై ఒకరికొకరు సహకరించుకోవాలని తీర్మానించుకున్నట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య చెక్‌పోస్టుల ఏర్పాటు, నది పరివాహక ప్రాంతాల్లో వరదల సమయంలో అనుసరించాల్సిన విధానాలు చర్చించినట్లు చెప్పారు. నేరాల విషయంలో సందేహాలను నివృత్తి చేసుకుంటూ తగిన సమాచారాన్ని చేరవేసుకునే విధంగా చూస్తామన్నారు.

వెంకన్నాలయంలో ప్రముఖుల పూజలు



భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న చినజీయర్‌స్వామి



పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి దంపతులు, పలువురు ప్రముఖులు

బిజినేపల్లి: వట్టెం వేంకటేశ్వరస్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాధవిదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చక బృందం, చినజీయర్ స్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మై హోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఉత్సవాల్లో పూజలు చేశారు. చినజీయర్‌స్వామి, జూపల్లి రామేశ్వర్‌రావు సమశ్రయనాల, సహస్ర కలశాభిషేకం పూజలు, భక్తులకు మంత్రోపదేశం చేసి సమశ్రయనాలు స్వీకరించారు. అనంతరం రామానుజ ప్రాంగణం, గోశాలను సందర్శించారు. భక్తులకు స్వయంగా చినజీయర్‌స్వామి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్‌రెడ్డి, హైదరాబాద్ కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి, నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు. శనివారం వట్టెం బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రాతరాధన, సేవాకాలం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, అర్చన, నివేధన, హోమం, సేవలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

అగ్నిగుండంలో నడిచిన భక్తులు



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

నవాబుపేట: మండలంలోని మరికల్ కోటచింతల దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించి అనంతరం అగ్నిగుండం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు ఓం నమః శివాయా అంటూ నిప్పుల్లో నడిచి భక్తిని చాటారు. మరికల్, కిష్టంపల్లి, బంగ్రంపల్లి, అగ్రహారం ప్రజలు పెద్దఎత్తున రథోత్సవానికి తరలి వచ్చారు.

ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద ఓవర్ ఫ్లో

శాంతినగర్: ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద ఓవర్ ఫ్లో కొనసాగుతుంది. టీబీ డ్యాం నుంచి విడుదలవుతున్న ఇండెంట్ నీరు తుంగభద్ర నదిలో ప్రవహిస్తుంది. దీంతో కర్ణాటక పరిధిలోని ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద శనివారం ఉదయం 0.4 అడుగుల మేర 2,357 క్యూసెక్కుల నీరు ఆనకట్టపై ప్రవహిస్తున్నట్లు ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. హెడ్‌వర్క్స్ నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు విడుదలైన నీరు కర్నాటక పరిధిలో 3.2 కిలోమీటర్ వద్ద 8.1 అడుగుల మేర ప్రవహిస్తూ 634 క్యూసెక్కుల నీరు దిగువన ఉన్న తెలంగాణ సరిహద్దుకు వస్తున్నాయి. తెలంగాణ సరిహద్దులోని సింధనూర్ వద్ద 42.60 కిలోమీటర్ వద్ద 4.8 అడుగుల మేర ప్రవహిస్తూ 331 క్యూసెక్కుల నీరు దిగువన ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు చేరుతుంది. డి–23 వద్ద పారుతున్న తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ నీరు డి–34 వరకు పారుతున్నాయి. దీంతో రైతులు పంటలకు నీటి తడులు ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు.



తనగల వద్ద ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు